# సంపాదకీయం

ఆదివారం 18-05-2025

## బ్రహ్మోస్ తో చైనాలో వణుకు

భారత సైన్యం ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. తర్వాత పాకిస్థాన్ ప్రయోగించిన తుర్కియే డ్రోన్లు, చైనా లాంఛర్లను కూడా మన ఎస్-400 తునాతునకలు చేసింది. దీంతో పాకిస్థాన్ అమెరికాను శరణు కోరింది. ఇదే సమయంలో భారత సైనిక శక్తిని చూసిన డ్రాగన్ దేశం చైనా ఉలిక్కిపడింది. దీంతో మన సైనిక రహస్యాలు తెలుసుకునేందుకు దొడ్డిగారిన ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో భారత జలాల సమీపంలో చైనాకు చెందిన గూఢచారి నౌక 'డా యాంగ్ యీ హావ్' కదలికలు అనేక అనుమానాలకు తావిచ్చాయి. ఈ నౌక హైడ్రోగ్రాఫిక్ సర్వేల పేరుతో భారత నౌకాదళ కదలికలను, జలాంతర్గాముల రాకపోకలను నిశితంగా గమనిస్తోందని, చైనా-పాకిస్థాన్ రాజకీయ సహకారాన్ని సూచిస్తోందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ నౌక కదలికలు భారత్‌కు సవాల్‌గా మారడమే కాకుండా, హిందూ మహాసముద్రంలో చైనా యొక్క వ్యూహాత్మక ఆసక్తులను కూడా బయటపెడుతున్నాయి.డా యాంగ్ యీ హావ్ ఒక భౌగోళిక, భౌతిక సర్వే నౌకగా చైనా పేర్కొన్నప్పటికీ, దీనిని భారత్‌తో సహా అనేక దేశాలు గూఢచార నౌకగా పరిగణిస్తున్నాయి. ఈ నౌక అధునాతన సెన్సర్లు, హైడ్రోగ్రాఫిక్ పరికరాలతో సముద్ర గర్భంలోని భౌగోళిక నిర్మాణాలను మ్యాప్ చేయగలదు, జలాంతర్గాముల కదలికలను గుర్తించగలదు. మిసైల్ పరీక్షల సమాచారాన్ని సేకరించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ నౌక భారత జలాల సమీపంలో మలక్కా జలసంధి నుండి శ్రీలంక దక్షిణం వైపు కదలడం గమనార్హం. ఈ కదలికలు భారత నౌకాదళం యొక్క ప్రతిస్పందన సామర్థ్యాన్ని, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి యుద్ధ నౌకల కదలికలను పసిగట్టే ప్రయత్నంగా భావిస్తున్నారు.చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ లో భాగమైన చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా నిర్మాణంలో ఉంది. ఈ ప్రాజెక్టుపై భారత్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఇది భారత సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తుందని భావిస్తోంది. సీపీఈసీ విజయవంతంగా అమలు కావాలంటే, పాకిస్థాన్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక బలం అవసరం, ఇది చైనాకు కీలకం. డా యాంగ్ యీ హావ్ కదలికలు ఈ ప్రాజెక్టు భద్రత కోసం సమాచార సేకరణలో భాగంగా ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నౌక సేకరించిన సమాచారం పాకిస్థాన్‌లోని జివానీ, గ్వాదర్ లేదా జిబౌటీ వంటి ప్రాంతాల్లో చైనా నిర్మించాలనుకుంటున్న సైనిక లాజిస్టిక్స్ బేస్‌కు ఉపయోగపడవచ్చు.ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత నౌకాదళం అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో అత్యంత అప్రమత్తంగా ఉంది. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో సమాయత్తమైన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు మోహరించబడ్డాయి. ఈ సందర్భంలో చైనా గూఢచారి నౌక కదలికలు భారత నౌకాదళ కమ్యూనికేషన్‌లను అడ్డుకోవడానికి, జలాంతర్గాముల రాకపోకలను ట్రాక్ చేయడానికి ఉపయోగపడవచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత నౌకాదళం ఈ కదలికలను నిశితంగా గమనిస్తూ, ఏదైనా దాడిని తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉంది.చైనా హిందూ మహాసముద్రంలో తన సైనిక, ఆర్థిక ప్రాబల్యాన్ని పెంచేందుకు నిరంతరం ప్రయత్నిస్తోంది. డా యాంగ్ యీ హావ్ వంటి నౌకలు సముద్ర గర్భంలోని ఖనిజ వనరులను, సముద్ర జలాల స్వభావాన్ని అధ్యయనం చేస్తూ, చైనా నౌకాదళం జలాంతర్గామి యుద్ధ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి సమాచారం సేకరిస్తున్నాయి. ఇవి భారత్‌తోపాటు ఇతర దేశాల సైనిక కదలికలను గమనించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆపరేషన్ సింధూర్‌పై భారత్‌కు వ్యతిరేకంగా , పాకిస్తాన్‌కు అనుకూలంగా తప్పుడు ప్రచారం చేశాయి టర్కీ , చైనా మీడియా సంస్థలు. అందుకే భారత్ కఠిన చర్యలు తీసుకుంది. పేర్లను మార్చేందుకు గతంలోనూ చైనా ప్రయత్నాలు చేసింది. 2017 నుంచి ఇప్పటికి నాలుగు సార్లు ఇలా కొన్ని ప్రాంతాల పేర్లు మార్చుతూ వచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగమే అంటూ మరోసారి స్పష్టం చేసిన కేంద్రం.. ఇలా భారత భూభాగాల పేర్లు, మ్యాప్‌లు మార్చే హక్కు చైనాకు లేదని కౌంటర్ ఇచ్చింది. అంతర్గత భద్రతపై సమావేశంలో చైనా గ్లోబల్ టైమ్స్‌పై కూడా నిషేధం విధించినట్టు అమిత్‌షా ప్రకటించారు.అధునాతన టెక్నాలజీని ఉపయోగించడం తోనే ఆపరేషన్ సింధూర్ విజయవంతమయ్యిందన్నారు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్. 10 శాటిలైట్ల సాయంతో ఆపరేషన్ సింధూర్ పూర్తి చేశారు. దీంతో ప్రపంచానికి భారత్ సత్తా తెలిసిందన్నారు అశ్విని వైష్ణవ్. యూపీ లోని జేవర్‌లో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. యూపీలో తొలి సెమీ కండక్టర్ యూనిట్ కాగా దేశంలో ఇది ఆరో యూనిట్ అని తెలిపారు.మరోవైపు భారత్ అమ్ముల పొది మరో అస్త్రం చేరింది. యాంటీ డ్రోన్ సిస్టమ్ భార్గవాస్త్రను విజయవంతంగా ప్రయోగించారు. ఒడిశా లోని గోపాలపురం తీరంలో ఈ ప్రయోగం జరిగింది. గాలి లోనే డ్రోన్లను ధ్వంసం చేసే వ్యవస్థను సోలార్ డిఫెన్స్ సిస్టమ్ తయారు చేసింది. మరోవైపు పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను భారత్ జామ్ చేసింది. 23 నిముషాల పాటు పాక్‌కు చైనా ఇచ్చిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను జామ్ చేసింది.2024లో యువాన్ వాంగ్-6, జియాంగ్ యాంగ్ హాంగ్-03 వంటి ఇతర చైనా నౌకలు హిందూ మహాసముద్రంలో కదలికలను గమనిస్తే, చైనా ఈ వ్యూహం దీర్ఘకాలికమని స్పష్టమవుతుంది.చైనా గూఢచారి నౌక కదలికలు పాకిస్థాన్‌కు మద్దతుగా సంకేతాలను పంపేందుకు, భారత్ యొక్క సైనిక సన్నాహాలను ముందుగా గుర్తించేందుకు ఉద్దేశించినవిగా భావిస్తున్నారు. ముఖ్యంగా, కరాచీ లేదా గ్వాదర్ వంటి పాకిస్థాన్ యొక్క వ్యూహాత్మక ప్రాంతాలపై భారత్ దాడి చేసే అవకాశం ఉంటే, ఈ నౌక సేకరించిన సమాచారం పాకిస్థాన్‌కు హెచ్చరికగా ఉపయోగపడవచ్చు. ఇది చైనా-పాకిస్థాన్ సైనిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశంగా కనిపిస్తుంది.

## ఇందూర్‌లో తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పిలుపు





నిజామాబాద్ మే 17 (లోకంతీరు):భారత సైనికుల ఘన విజయం "ఆపరేషన్ సిందూర్"కు అద్దంపట్టేలా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "తిరంగా ర్యాలీ" కోసం ఇక్కడ ఇందూర్ నగరంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ జి.వి. కృపాకర్ రెడ్డి అధ్యక్షతన సుభాష్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూపాహల్గాం ఘటనలో ఉగ్రవాదులు భారతీయులపై చేసిన దారుణ హత్యలను దేశం మరచిపోదని పేర్కొన్నారు.ఆ ఘటనకు బదులుగా మోదీ ఆదేశాలతో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో, కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే దాడులు జరిపి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడం గర్వకారణమన్నారు.కాందహార్ హైజాకింగ్, పుల్వామా దాడుల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తుల హతమర్చడం ప్రత్యేకమన్నారు.పాకిస్థాన్ సామాన్యులపై కాకుండా టార్గెట్ చేసిన విధానం భారత సైనిక నీతికి నిదర్శనమన్నారు.ఆకాశ్ తీర్, బ్రహ్మోస్, సుదర్శన్ ఎస్-400 వంటి ఆధునిక రక్షణ వ్యవస్థలతో పాకిస్తాన్ డ్రోన్లను గాలిలోనే తరిమికొట్టిన తీరు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందన్నారు.ఇది ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ రక్షణ రంగానికి లభించిన ప్రోత్సాహానికి చక్కని ఉదాహరణ అన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా స్వదేశీయంగా యుద్ధ పరికరాల తయారీ అభివృద్ధి చెందుతోందన్నారు.ఈ విజయానికి గుర్తుగా, జాతీయ గౌరవానికి సంకేతంగా, 'మనమూ దేశం కోసం' నినాదంతో ఇందూర్ నగరంలో భారీ తిరంగా ర్యాలీనిమే 19, సాయంత్రం 4:00 గంటలకు రాజరాజేంద్ర చౌరస్తా (ఆర్ ఆర్ చౌరస్తా) నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ర్యాలీని ప్రజలందరూ సంఘీభావంతో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ధన్ పాల్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఓంప్రకాశ్ దైమా, డా. వెంకటరమణ, యాదగిరి, నరసింహ, గజం ఎల్లప్ప, బుస్సాపూర్ శంకర్, పంచారెడ్డి ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

### సమన్వయంతో పని చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలి

### బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీ.పీ





నిజామాబాద్, మే 17 : పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం 1977 ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పోతంగల్, ఖండ్ గావ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీ.పీ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. సీజ్ చేసిన పశువులకు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర రావు, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏ.సీ.పీలు రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిపిని కంట్రోల్ చేసుకోవాల్సిందే !

### సకల అనారోగ్యాలకు అదే కారణం

### నేడు ప్రపంచ రక్తపోటు దినోత్సవం

హైదరాబాద్,మే17: ప్రపంచ రక్తపోటు దినోత్సవం 2006 నుండి, మే 17గా గుర్తించబడింది. ప్రపంచ రక్తపోటు దినం హైపర్‌టెన్షన్ మరియు దాని పర్యవసానాల గురించి అవగాహన కల్పించడానికి. ప్రపంచ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా దానిని నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి అని వైద్యుల సూచిస్తున్నారు. ఆరోగ్యవంతుడైన మానవుని సాధారణ రక్తపీడనం (బిపి) 120/80 ఉండాలి. ఇది 140/90 కంటే ఎక్కువైతే అధిక రక్తపోటు లేదా అధిక రక్తపీడనం (హై బిపి) గాను, 90/60 కంటే తక్కువైతే అల్ప రక్తపోటు లేదా అల్ప రక్తపీడనం (లో బిపి) గాను అంటారు. ఈ రెండు ప్రమాదకరమైనవే. దీనిలో 120 అనేది సిస్టోలిక్ పీడనాన్ని, 80 అనేది డయాస్టోలిక్ పీడనాన్ని తెలియజేస్తుంది.హృదయం యొక్క సంకోచాన్ని సిస్టోల్ అంటారు. హృదయం యొక్క సడలికను డయాస్టోల్ అంటారు. రక్తపోటు వ్యాధి లక్షణాలు ఎట్టిపరిస్థితుల్లోను బయటపడవు. కాబట్టి దీనిని నిశ్శబ్ద కిల్లర్ అని పిలుస్తారు హైపర్‌టెన్షన్ లేదా హై బ్లడ్ ప్రెజర్ అనేది సైలెంట్ కిల్లర్. శరీరంలోని దాదాపు ప్రతి అవయువాన్ని ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు, హైపర్‌టెన్షన్ మూత్రపిండాలను ప్రభావితం చేస్తుంది, స్ట్రోక్‌లు, తదుపరి పక్షవాతం ఏర్పడవచ్చు, జఠరికల విస్తరణకు దారితీయవచ్చు మరియు రెటీనాపై కూడా ప్రభావం చూపుతుంది. భారతదేశంలో, కార్డియోవాస్కులర్ డిసీజ్ మరణానికి ప్రధాన కారణం, మరియు అధిక రక్తపోటు అ÷ఎఆలో సగానికి పైగా ఉంది.భారతీయ జనాభాలో హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగు తోంది. 2005లో 20.6 శాతం భారతీయ పురుషులు మరియు 20.9శాతం భారతీయ స్త్రీలు రక్తపోటుతో బాధపడుతున్నారని అంచనా వేయబడింది. ఈ సంఖ్య 22.9 నాటికి భారతీయ పురుషులు మరియు స్త్రీలలో 23.6 మరియు 2025కి పెరుగుతుందని అంచనా వేయబడింది. చికిత్స పొందిన రోగులలో 25.6శాతం మంది మాత్రమే వారి బిపి నియంత్రణలో ఉండటం ఆందోళనకు అత్యంత ముఖ్యమైన కారణం. అవగాహన లేకపోవడమే అత్యంత ముఖ్యమైన ప్రమాదం హైపర్‌టెన్షన్ డే యొక్క థీమ్ 'మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, దానిని నియంత్రించుకోండి, ఎక్కువ కాలం జీవించండి. వివిధ మందులను టైట్రేట్ చేయడం ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచడం నిరంతర పర్యవేక్షణ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

## సహకార సంఘాలలో ఎరువుల తనిఖీలు.





ఎడపల్లి మే 17 ( లోకం తీరు). ఎడపల్లి మండలంలో సహకార సంఘాలలో ఎరువుల తనిఖీలు15.5 2025 నాడు జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గౌరవ కలెక్టర్ గారు ఆదేశానుసారము మండలంలో సహకార సంఘాలలో ఎరువుల యొక్క నిలువలను తనిఖీ చేయవలసిందిగా తాసిల్దార్ మరియు వ్యవసాయ అధికారి గార్లకు సూచించడం అయినది కలెక్టర్ గారి సూచనల మేరకు శనివారంరోజు సంయుక్తంగా ఎరువుల తనిఖీలు ఎడపల్లి సొసైటీ మరియు మంగల్పహాడ్, కుర్నాపల్లి, ధర్మారం ,లాలో గల ఎరువుల గోదాములను తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా అన్ని రకముల ఎరువులను మరియు స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్ లకు సరిపోయినాయా లేదా అని చూడడం జరిగింది అట్లాగే డీలర్లకు రైతులకు రసీదు తప్పకుండా ఇవ్వాలని సూచించడం జరిగింది ఎరువులను క్రమ పద్ధతిలో అమర్చాలని ఎరువులు సరిపడా ఉండేటట్టు చూసుకోవాలని రైతులకు ఎటువంటి ఇబ్బందికి గురి చేయరాదని సేల్స్ మాన్ లకు సూచించడం జరిగింది ఈ తనిఖీలు ఎడపల్లి తాసిల్దార్ శ్రీ దత్తాత్రేయ గారు అట్లాగే వ్యవసాయ అధికారి సిద్ధిరాజేశ్వర్ పాల్గొనడం జరిగింది

## ముఖ్యమంత్రి గారు రైతుల ఘోష వినిపించుకోండి: ఎంపీ ఈటెల రాజేందర్





మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,మే17:ఆరుగాలం పండించిన పంట తన కళ్ళముందే నీళ్ల పాలైనప్పుడు, నేల పాలైనప్పుడు రైతుల గోస, కన్నీళ్లు వర్ణనాతీతం.తిడితే తిట్టిన అంటారు. విమర్శిస్తే ప్రశ్నిస్తారనీ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.మరి ఈ రైతుల గోస ఎవరు పట్టించుకోవాలి.నెల రోజులు కొనుగోలు సెంటర్స్ లో కొనే దిక్కు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి భూమ్మీదికి దిగిరండి. రెండు రోజుల్లో కొనుగోలు చేయండనీ ఎంపీ ఈటెల రాజేందర్ కోరారు.ఘట్కేసర్ మండలం ఏదులాబాదులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్. రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చి 20 రోజులకు పైగా అయిందని చెప్పిన రైతులు.ఇప్పటికీ మూడు సార్లు వర్షం వచ్చి తడిచి మొలకలు వచ్చాయని వాపోయారు. గట్టిగా అడిగితే బెదిరిస్తున్నారు తప్ప కొనుగోలు చేయడం లేదని చెప్పారు. 40 కేజీల బస్తాకు మూడున్నర, నాలుగు కేజీలు తరుగు తీస్తున్నారని రైతుకు తీవ్ర నష్టం చేస్తున్నారని వివరించారు.అధికారులతో మాట్లాడిన ఈటల : స్థానిక వ్యవసాయ పౌరసరఫరాల శాఖల అధికారులతో, జాయింట్ కలెక్టర్ తోను మాట్లాడి రెండు రోజుల్లోగా ధాన్యమంతా కొనుగోలు చేయాలని కోరిన ఈటల రాజేందర్.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ : తెలంగాణ వ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒకచోట అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచిపోవడం కొట్టుకుపోవడం మొలకలు రావడం జరుగుతుంది. 25 రోజులుగా గన్నిబ్యాగ్స్, సుతిల్ తాళ్లు, హమాలీలు, ట్రాన్స్పోర్ట్ చివరికి తార్పాలాలు లేక ఐకెపి సెంటర్లో రైతులు ఇబ్బంది పడుతూనే ఉన్నారనీ అన్నారు.

# ముంబైలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల పట్టివేత

## ఛత్రపతి విమానాశ్రయంలో పట్టుకున్న ఎన్ఐఏ
## కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవేట

ముంబై,మే17: పహల్గాం ఘటన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది.తాజాగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. ఇండోనేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన ఐసిస్ సభ్యులు అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి విమానాశ్రయంలోని టెర్మినల్ 2 వద్ద వీరు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఇమిగ్రేషన్ బ్యూరో అధికారులు అడ్డుకున్నారు. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు- గుర్తించామన్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో స్థానిక పోలీసులు ఇప్పటికే వీరిని గాలిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో వీరు భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అదే ప్రదేశంలో స్లీపర్ సెల్స్‌కు బాంబు తయారీ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు. వారిని పట్టుకోవడానికి సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు- తెలుస్తోంది. గత రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు- తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడం కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ఏజెన్సీ చేస్తున్న ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ప్రధాన ముందడుగని తెలిపారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ బృందాలు ఉగ్రవాదుల జాడ కోసం జమ్మూకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. శనివారం స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గండర్‌బాల్, బారాముల్లా సహా 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టినట్లు- అధికారులు పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్‌లోని బబ్బర్ ఖల్సా ఉగ్రవాద సంస్థకు చెందిన 15 ప్రదేశాలపై ఎన్ఐఏ బృందాలు దాడులు చేశాయి.

# ముంబై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

## బెదిరింపు మెయిల్ రాకతో పోలీసుల అప్రమత్తం

ముంబై,మే17 ముంబై విమానాశ్రయ పోలీసులకు బాంబు బెదిరింపు ఇమెయిల్ వచ్చింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రసిద్ధ తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ ను పెల్చేస్తామని బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, ఈ ఇమెయిల్ నేరుగా పోలీసుల అధికారిక ఇమెయిల్ ఐడికి పంపబడింది. ఉగ్రవాది అఫ్జల్ గురు, సాయిబాబు శంకర్ ఉరిశిక్షలను బెదిరింపు మెయిల్‌లో దుండగులు ప్రస్తావించినట్లు సమాచారం. వారిద్దరిని అన్యాయంగా ఉరితీశారని ఆరోపిస్తూ..ముంబైలోని రెండు ప్రముఖ ప్రదేశాలపై దాడులు చేస్తామని బెదిరించినట్లు- అధికార వర్గాలు తెలిపాయి. బెదిరింపు ఈమెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసులు రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. విమానాశ్రయం, హోటల్ ప్రాంగణాలను స్కాన్ చేయడానికి బృందాలను నియమించారు. రెండు ప్రదేశాలలో భద్రతను పెంచారు. ముంబైలోని కీలక ప్రదేశాలలో నిఘా పెంచినట్లు అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతానికి ఎటు-వంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని అధికారులు చెప్పారు. ఈమెయిల్ ద్వారా బెదిరింపు వెనుక ఉన్న వ్యక్తిని గుర్తించడానికి అధికారులు ప్రస్తుతం దర్యాప్తు చేపట్టారు.

# మిషన్ భగీరథకు మోకాలడ్డు



## ఫ్లోరైడ్ ప్రాంతాలకు విముక్తి పట్టని కాంగ్రెస్
## మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు

నల్లగొండ,మే17 మిషన్ భగీరథ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ నివారణ జరిగేదని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. అయితే కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని కాంగ్రెస్ కొనసాగించడం లేదన్నారు. ఇంటింటికి నీరు వస్తేనే ఫ్లోరైడ్ దూరం అవుతుందిన జగదీశ్వర్ రెడ్డి అంగీకరించారు. ఇందుకు భగీరథ ఒక్కటే పరిష్కారం అన్నారు. భూగర్భ జలాల వినియోగం తగ్గితేనే ఇది సాధ్యం అన్నారు. శాశ్వత కరువు, ఫ్లోరోసిస్ నివారణకు కృష్ణా జలాలు అందించాలన్న పథకం ముందుకు సాగక పోవడంతో ఫ్లోరైడ్ గ్రామాలకు శాప విమోచనం కలగడంలేదు. జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, ఈ ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్‌తో పోరాడుతున్నారు. ఫలితంగా నక్కలగండి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు అందించనున్నట్టు ఆనటి కెసిఆర్ ప్రభుత్వం ప్రకటించి, ముప్పై లక్షలు కేటాయించింది. కానీ ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని నేటికీ పూర్తి చేయకపోవడంతో ప్రజలకు మంచినీటి లక్ష్యం నెరవేరడం లేదు. శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పథకాన్ని చేపట్టి గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల నీరు నల్గొండ జిల్లాలో అదనంగా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 700 గ్రామాలకు తాగునీరు అందించాలని జిల్లా ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో గతంలో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శ్రీశైలం కుడి, ఎడమ కాల్వలకు శంకుస్థాపన చేశారు. అయితే కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. ఎడమ కాలువ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం జరిగింది. శ్రీశైలం సొరంగం పథకాన్ని చేపట్టాలన్న జిల్లా ప్రజల ఆందోళనతో అనుమతిచ్చారు. దీన్ని నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించనందున పూర్తికాలేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే యాభై ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టు పూర్తికాదు. కాబట్టి తక్షణమే పూర్తిచేసి అందులో అంతర్భాగమైన నక్కలగండి (లోయర్‌డిండి) రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలి. ఈ పథకంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ద్వారావచ్చే నాలుగువేల క్యూసెక్కులలో మూడువేల క్యూసెక్కులను దిగువ డిండి (నక్కలగండి) జలాశయం నుంచి రెండు స్టేజీలలో ఎగువ డిండికి 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 3.4 లక్షల ఎకరాలకు సాగునీరందించే సౌకర్యం ఉన్నది. శ్రీశైలం సొరంగ మార్గం ద్వారా వచ్చే నీటిని నక్కలగండి (చందంపేట మండలం) వద్ద 7. టీఎంసీల సామర్థ్యంతో లోయర్ డిండి రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ఎడమ కాలువ ద్వారా ఏఎమ్మార్పీకి సరఫరా చేస్తారు. గోనబోయినపల్లి సమీపంలోని మేళ్లచెరువును మిడ్ డిండి రిజర్వాయర్‌గా 11 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తారు. మిడ్ డిండి నుంచి 12.75 కిలోమీటర్ల సొరంగం ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని విడుదల చేసి, అక్కడి నుంచి 560 మీటర్ల పొడవు, మూడుమీటర్ల వ్యాసార్థం కలిగిన ఆరు పైపుల ద్వారా 134 మీటర్ల ఎత్తు నుంచి అప్పర్ డిండికి సరఫరా చేస్తారు. ప్రస్తుత డిండి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 7.2 టీఎంసీలకు పెంచుతారు. మధ్య డిండి రిజర్వాయర్ నుంచి .7 కిలోమీటర్ల పొడవు కాల్వలు తవ్వుతారు. ఈ కాలువకు మధ్యలో కాసారం, దేవరకొండ, సామలపల్లి గ్రామాల వద్ద 7 టీఎంసీల సామర్థ్యంతో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తారు. ఇవేగాక మైనంపల్లి, ఉప్పువాగు, నాంపల్లి, ఇర్విన్ వద్ద కూడా రిజర్వాయర్లు ఏర్పాటు- చేస్తారు. మిడ్ డిండి ద్వారా డిండి, దేవరకొండ, చందంపేట, గుర్రంపోడ్, ఉప్పువాగు, నాంపల్లి, మునుగోడు, చండూరు, కనగల్లు, నల్గొండ మండలాలలో సుమారు 90,500 ఎకరాలు, అచ్చంపేట మండలంలో 1000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నల్గొండ జిల్లాలో పశ్చిమ భాగంగా ఉన్న దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజకవర్గాల్లో 14 కరువు పీడిత మండలాలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఐదు మండలాల్లో సాగు, తాగునీరు అందించే ఈ పథకానికి ప్రణాళిక చేశారు.

# ఇష్టారాజ్యంగా బోర్ల తవ్వకాలు

## కలసివస్తున్న అధికారుల ఉదాసీనత

నిజామాబాద్,మే17(: అధికారుల్లో నెలకొన్న ఉదాసీనత వైఖరిని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా వాల్టాచట్టం క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. బోరు తవ్వకం సమంలో సమీపంలోని మరోబోరు, బావికి కనీసం 200 మీటర్ల దూరం పాటించాలి. కొత్తగా బోరుబావి వేసుకునే రైతు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా శాస్త్రీయపద్ధతులను అనుసరించి జియాలాజికల్ అధికారులు సర్వే నిర్వహిస్తారు. అధికారులు సూచించిన ప్రదేశంలో బోరుబావి పడకుంటే రూ.10వేల వరకు బాధిత రైతుకు బీమా సౌకర్యం లభిస్తుంది. అయితే రైతుల్లో నెలకొన్న అవగాహన లోపంతో తమ ఇష్టాను సారంగా బోరుబావులు తవ్వించి ఆర్థికంగా నష్టపోతున్నారు. రిగ్గుల రిజిస్ట్రేషన్ బోరుబావులు తవ్వే రిగ్గుల యజమాని రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకుండా బోరుబావులను తవుతున్న రిగ్గులను అధికారులు సీజ్‌చేయాల్సి ఉంటుంది. అలాంటి చర్యలేవీ లేకపోవడంతో రిగ్గుల యాజమాన్యాలు తమకు నచ్చిన ప్రదేశంలో బోరుబావి తవ్వకాలు చేపట్టి రైతుల నుంచి వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారు.బోరుబావుల తవ్వకం, చెట్లనరికివేత, నదులు, వాగుల నుంచి ఇసుకతీత, తాగునీటి వనరుల కలుషితం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టపడక పోగా, వాల్టా చట్టంలోని నియమనిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వర్షాభావంతో చాలాచోట్ల ఇష్టం వచ్చినట్లుగా బోర్ల తవ్వకం చేపడుతున్నారు. బోరుబావుల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ప్రతిబావి యజమానీ 10 రూపాయలను రెవెన్యూ కార్యాయలంలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పర్యావరణం, భూగర్భజలాలు, సహజవృక్షసంపద పరిరక్షణ కోసం వాల్టా చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. అమలులో పారదర్శకత కొరవడి ఉల్లంఘన చర్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల మధ్య అవగాహన లోపంతో చట్టం ఉల్లంఘనదారులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టి లో ఉంచుకొని ప్రభుత్వం కొన్ని నిమయనిబందనలు అందులో పొందుపరిచారు. మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ-, గ్రామపంచాయతీల పరిధిలో చెట్లను పరిరక్షించి వాతావారణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు రెవెన్యూ, అటవీ శాఖ, గ్రామపంచాయతీ అధికారులు కృషి చేయాలి. ఎవరైనా చెట్ల యజమానిచెట్లను తన అవసరాల కోసం పడ గొట్టాలనుకుంటే అధికారుల నుంచి అనుమతిపొందాలి. చెట్లను నరికివేసిన 30 రోజుల వ్యవధిలో సమీప ప్రదేశంలో రెండు మొక్కలు నాటాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులకు అప్పగించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడంతో గ్రామాల్లోని సహజ అటవీ వృక్ష సంపద తగ్గుతున్నది. బొగ్గుబట్టీల వ్యాపారులు గ్రామశివారు భూముల్లోని చెట్లను నరికించి కాల్చడంతో తయారైన బొగ్గొను ఇతరప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా సమీపగ్రామాల్లో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నది. నీటి కలుషితంపై నియంత్రణ భూగర్భజలాలు కలుషితం కాకుండా నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

# అన్ని సంక్షేమ కార్యక్రమలు కొనసాగించాలి : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, మే 17 : గత కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల అవసరాలను గుర్తించి షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి వంటి వివిధ పథకాలను ప్రవేశ పెట్టిందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించి మారేడ్‌పల్లి, ముషీరాబాద్ మండలాలకు చెందిన 255 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సీతాఫల్ మండి చౌరస్తాలో పద్మారావు గౌడ్ శనివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి సంబంధించి చేసిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హోదాలోని వ్యక్తి



ప్రభుత్వం వద్ద నిధులు లేవని పదే పదే పేర్కొనడం సరికాదని పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో నిరంతరం తాము ప్రజలకు అండగా నిలుస్తున్నామని, సీతాఫల్ మండిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజల సమస్యలను పరిష్కరించే పద్ధతిని పద్ధతిని పాటిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలకు, ప్రజలకు తాము అండగా నిలుస్తామని, ఏ అవసరానికైనా ప్రజలు తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.మారేడుపల్లి మండలానికి చెందిన 159 మందికి, ముషీరాబాద్‌కు చెందిన 96 మందికి రూ.2.55 కోట్ల మేరకు విలువజేసే చెక్కులను పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పంపిణీ చేశారు. మారేడుపల్లి ఎమ్మార్వో భీమయ్య గౌడ్, ముషీరాబాద్ ఎమ్మార్వో ప్రతాప్ సింగ్, వెంకట లక్ష్మి, కార్పొరేటర్లు హేమ, శైలజ, ప్రసన్న లక్ష్మి , సునీత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆప్‌కు 13 మంది రెబల్ కౌన్సిలర్ల రాజీనామా.. కొత్త పార్టీ ప్రకటన

హైదరాబాద్, మే 17, (న్యూస్ పల్స్) ఇటీవలే జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (౦ంఖ) ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఆ షాక్ నుంచి తేరుకోకముందే ఆ పార్టీకి ఇప్పుడు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన దాదాపు 13 మంది ఢిల్లీ కౌన్సిలర్లు ఆప్‌కు రాజీనామా చేశారు. ఇందులో రెబల్ కౌన్సిలర్లు ముఖేష్ గోయల్ కూడా ఉన్నారు.ఆయన నాయకత్వంలో వీరంతా థర్డ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తమ పార్టీ పేరును కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. 'ఇంద్రప్రస్థ వికాస్' పేరుతో పార్టీని ప్రకటించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గోయెల్ ఆదర్శ్ నగర్ నియోజకవర్గం నుంచి ఆప్ టికెట్‌పై పోటీ చేసి ఓటమి చవిచూశారు.ఇక రాజీనామా చేసిన రెబల్ కౌన్సిలర్లలో.. ముఖేష్ గోయల్, హేమంచంద్ గోయల్, దినేష్ భరద్వాజ్, హిమానీ జైన్, ఉషా శర్మ, సాహిబ్ కుమార్, రాఖీ కుమార్, అశోక్ పాండే, రాజేష్ కుమార్, అనిల్ రాణా, దేవేంద్ర కుమార్, హిమానీ జైన్ ఉన్నారు. గత మున్సిపల్ ఎన్నికలకు ముందు వీరంతా కాంగ్రెస్‌ను వీడి ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఇక 25 ఏళ్లుగా మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన గోయెల్.. 2021లో కాంగ్రెస్‌ను వీడి ఆప్‌లో చేరారు. మరోవైపు మూడు నెలల క్రితమే ఆప్‌కు చెందిన ముగ్గురు




కౌన్సిలర్లు అనితా బసోయ, నిఖిల్ చప్రానా, ధరమ్‌వీర్ బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరో 13 మంది కౌన్సిలర్లు రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాల్లో సంచలనం రేపుతోంది.

# సముద్రాన్నే తలపించిన చారిత్రక సన్నివేశం..

## కరీంనగర్ సింహగర్జన : కేటీఆర్

హైదరాబాద్ : దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది వేసిన "తెలంగాణ సింహగర్జన"కు సరిగ్గా 24 ఏళ్లు అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కరీంనగర్ వేదికగా ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆనాడు పూరించిన సమరశంఖం ఢిల్లీ వరకూ ప్రతిధ్వనించిన అపూర్వ సందర్భమది అని పేర్కొన్నారు.తెలంగాణ నలువైపుల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ఆ జనప్రవాహం.. ఓ సముద్రాన్నే తలపించిన చారిత్రక సన్నివేశమది. తెలంగాణ వచ్చేదా సచ్చేదా అని ఎంతో మంది అడుగడుగునా అవమానించినా, రకరకాలుగా అవహేళన చేసినా వెన్నుచూపని ఆ ధీరోదాత్తుడి సంకల్పం ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే ఓ చెరగని సంతకం. ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, ఒక్కరితో మొదలైన ఆనాటి ప్రయాణం అనుకున్న గమ్యాన్ని ముద్దాడటమే ఒక చారిత్రక విజయమైతే.. ఇక ఉద్యమ నాయకుడే ఉత్తమ పాలకుడై, సాధించిన తెలంగాణను పదేళ్లలోనే దేశానికే దారిచూపి దీపస్తంభంలా తీర్చిదిద్దిన ఆ దార్శనికత.. ప్రతి తెలంగాణ బిడ్డకు ఎప్పటికీ గర్వకారణం అని కేటీఆర్ పేర్కొన్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అని కేటీఆర్ నినదించారు.



# పాక్ దుర్నీతిని ఎండగట్టేందుకు దౌత్యనీతి



## విదేశాలకు వివరించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం
## ఏడుగురు ఎంపిలతో ఏడు బృందాల ఏర్పాటు
## శశిథరూర్, కనిమొళి, సుప్రియా సూలెలకు చోటు
## థరూర్ పేరను కావాలనే ఎంపిక చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ,మే17: భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతోన్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కొందరిని ఎంపిక చేసింది. వీరంతా వివిధ దేశాలకు వెళ్లి పాక్ ఉగ్ర కుట్రలను వివరిస్తారు. ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం కేంద్రం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసే)లు ఉన్నారు. వీరంతా విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఈ బృందాలు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించ నున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు, పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరించడం, భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వనున్నారు. అలాగే ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం చేస్తారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును కూడా ఈ సందర్భంగా వివరించడం జరుగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక వివరణ ఇచ్చింది. ఆ ప్రతినిధుల బృందాలకు ఏడుగురు ఎంపీలు నాయకత్వం వహిస్తుండగా.. వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ కూడా ఉన్నారు. అయితే కాంగ్రెస్ పంపిన



జాబితాలో అసలు థరూర్ పేరు లేకపోవడం గమనార్హం. పాక్‌ను ఎండగట్టేందుకు పంపే బృందం కోసం పేర్లు పంపాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మే 16న కాంగ్రెస్‌ను కోరగా, అదేరోజున కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నాలుగు పేర్లు పంపారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, రాజ్యసభ ఎంపీ డాక్టర్ సయ్యద్ నజీర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్, మరో నేత గౌరవ్ గొగొయ్ ఉన్నారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ జాబితాలో థరూర్ పేరు లేదు. అయితే శనివారం కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో వారి పేర్లేవీ లేవు. కానీ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు మాత్రం అనూహ్యంగా చోటు- దక్కింది. ఇటీవలి పరిణామాలపై దేశం విధానాన్ని వివిధ దేశాలకు వివరించేందుకు వెళ్తున్న బృందానికి నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ప్రయోజనాలతో ముడిపడిన సందర్భాల్లో అక్కడ నా అవసరం ఉంటే.. నేను అందుబాటులో ఉంటా. జైహింద్ అని థరూర్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# సినిమా తీరు

## సంచలన కాంబినేషన్ హ్యాట్రిక్ పై కన్నేసారా?



బాలీవుడ్ లో రాజ్ కుమార్ హిరాణీ బ్లాక్ బస్టర్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆయన నుంచి సినిమా రావడానికి మూడు నాలుగేళ్లు పడుతుంది. కానీ వచ్చిందంటే? ఓ గొప్ప చిత్రంతోనే ప్రేక్షకుల ముందుకు రావడం ఆయన ప్రత్యేకత. గత సినిమా 'డంకీ' భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా ఆ సినిమా అంచ నాలను పూర్తి స్థాయిలో అందుకోలేకపోంది. మంచి సినిమాగా విమర్శకుల ప్రశంసలు అందు కున్నా? ఆయన రేంజ్ హిట్ చిత్రంగా కనిపించలేదు. అప్పటి నుంచి హిరాణీ నుంచి కొత్త సినిమా ప్రకటన రాలేదు. దీంతో ఆ సినిమా న్యూస్ చెబుతారా? అని హిరాణీ అభిమానులంతా వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజ్ కుమార్ హిరాణీ మరోసారి బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ నిస్ట్ అమీర్ ఖాన్ తో సినిమా చేసే దిశగా అడుగు లు వేస్తున్నారు. ఇద్దరి కాంబినేషన్ లో మరో కామెడీ ఎంటర్ టైనర్ రాబోతుందని వినిపిస్తుంది. స్టోరీ విషయంలో క్లారిటీ లేదు గానీ ఇద్దరు మధ్య మాత్రం చర్చలు జరుగుతున్నట్లు హిరాణీ కన్ఫమ్ చేసారు.మూడు స్టోరీ లైన్ ల్ లతో హిరాణీ మూవ్ అవుతున్నారు. కానీ అందులో ఏ స్టోరీ లో అమీర్ కనిపిస్తారు అన్నది క్లారిటీ ఇవ్వడం లేదు. ఆయన ఎలాంటి కథ తెచ్చినా అమీర్ చేయడానికి సిద్దంగా ఉంటారు. ఆయనపై అమీర్ కు అంత నమ్మకం. గతంలో ఇద్దరి కాంబినేషన్ లో రిలీజ్ అయిన '3 ఇడియట్స్', 'పీకే' చిత్రాలు ఎలాంటి విజయాలు సాధించాయో తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ ఇద్దరు చేతులు కలపలేదు. అలాగే హిరాణీ ఆయన పాత సినిమాలకు సీక్వెల్ చేసే ఆలోచనలో కూడా ఉన్నట్లు గతంలో వెల్లడించారు. 'మున్నాభాయ్' కి సీక్వెల్ ఆలోచన ఉంది. ఆ కథ ప్రథమార్ధం కూడా సిద్దమైనట్లు వెల్లడించారు. ద్వితియార్ధం నుంచే కలం కదలలేదన్నారు. మరి తాజాగా అమీర్ తో కామెడీ ఎంటర్ టైనర్ అయితే 'పీకే2' అవుతుందా? అన్న ప్రచారం మొదలైంది. అమీర్ తో ఏ సినిమా అయినప్పటికీ వచ్చే ఏడాది ఆ చిత్రాన్ని ప్రారంభించాలన్నది ప్లాన్.

## 'తమ్ముడు' తప్పుకోవడంతో రేసులోకి 'కింగ్ డమ్'?

సమ్మర్ సీజన్లో టాలీవుడ్ సినిమాలు వరుసగా వాయిదా పడుతూ అభిమానులను నిరాశపరుస్తున్నాయి. 'హరిహర వీరమల్లు', 'విశ్వంభర' సినిమాల పనులు ఆలస్యం, ఇతర కారణాలతో మే నుంచి జూన్‌కు వాయిదా పడ్డాయి. ఇప్పుడు 'కింగ్‌డమ్', 'తమ్ముడు' సినిమాలు కూడా వాయిదా వార్తలతో అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాయి. సమ్మర్ సీజన్లో భారీ సినిమాలు ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించేందుకు సిద్ధంగా ఉంటాయని అందరూ భావిస్తుండగా, ఈ వాయిదాలు చర్చనీయాంశంగా మారాయి. 'కింగ్‌డమ్' సినిమా కూడా పలు కారణాల వల్ల ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తోంది. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్‌లో ఆలస్యం, పోస్ట్-ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ డేట్ ఎన్నోసార్లు మారింది. మొదట మే 30న విడుదల కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కింగ్‌డమ్' యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో సితార బ్యానర్‌పై నిర్మితమవుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నాడని, భాగ్యశ్రీ బోర్సే అతని సరసన నటిస్తూ అందరినీ ఆకర్షిస్తుందని సమాచారం. అనిరుద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా టీజర్, గ్లింప్స్‌లు ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేశాయి. లేటెస్ట్ సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జులై 4 విడుదల కానుంది. మొదట ఈ తేదీన విడుదల కావాల్సిన 'తమ్ముడు' సినిమా వాయిదా పడే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. దిల్ రాజు నిర్మాణంలో రూపొందుతున్న 'తమ్ముడు' సినిమాలో నితిన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలు ఒకే రోజు



విడుదలైతే బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ తప్పదని భావించిన నిర్మాతలు, 'తమ్ముడు'ను వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 'తమ్ముడు' సినిమా కొత్త రిలీజ్ డేట్ కోసం నిర్మాతలు చూస్తున్నారు. ఈ సినిమా సిస్టర్ సెంటిమెంట్ తో డిఫరెంట్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతోందని సమాచారం. ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కింగ్‌డమ్', 'తమ్ముడు' సినిమాలు హిట్ కావడం విజయ్ దేవరకొండ, నితిన్ లకు చాలా అవసరం. ఇటీవలి కాలంలో వీరిద్దరూ పెద్దగా సక్సెస్ సాధించలేకపోయారు. విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్', నితిన్ 'రాబిన్ హుడ్' సినిమాలు నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు సినిమాలు వీరి కెరీర్‌లో కీలకంగా మారనున్నాయి. మరి ఈ సినిమాలు ఎలాంటి విజయం సాధిస్తాయో చూడాలి.

## ఈ ఫేస్ మాస్క్ రాసుకుంటే.. మీ ముఖం చందమామలా తళతళా మెరిసిపోతుంది, ఎలా చేసుకోవాలంటే?

ఈ ఎండా కాలంలో బయటకు వెళ్లడం తప్పదు. ఇలా బయటికి వెళ్ళినప్పుడు ఎండ కిరణాల ప్రభావంతో చర్మం చాలా వరకు దెబ్బతింటుంది. ఎండ వేడికి చర్మం నల్లబారడం, మొటిమలు, మచ్చలు రావడం వంటి సమస్యలు తరచూ ఎదురవుతుంటాయి. మార్కెట్‌లో దొరికే కెమికల్ ఆధారిత బ్యూటీ ఉత్పత్తులు ఎక్కువ ఖర్చుతో పాటు చర్మానికి నష్టం కలిగించే ప్రమాదం కూడా ఉంది. అయితే మన ఇంట్లోనే లభించే సహజ పదార్థాలతో చర్మాన్ని సంరక్షించుకోవచ్చు. అందులో బీట్‌రూట్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే బీట్‌రూట్, చర్మం ప్రకాశవంతంగా మారడంలోనూ అద్భుతంగా పనిచేస్తుంది. బీట్‌రూట్‌లో ఉండే విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని హైడ్రేట్ చేసి, మృదువుగా, నిగారింపుగా ఉంచుతాయి. ఇప్పుడు ఇంట్లోనే తక్కువ సమయంతో తయారు చేసుకునే బీట్‌రూట్ ఫేస్ మాస్క్‌లను ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.. "అమృతాన్ని తలపించే దూద్ దులారి..ఈజీగా ఇలా చేసుకోండి" 1. బీట్‌రూట్-రోజ్‌వాటర్ ఫేస్ మాస్క్ తయారీ విధానం: బీట్‌రూట్ ముక్కలను మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయండి. వడకట్టి తీసిన రసంలో రెండు టేబుల్ స్పూన్లు రోజ్ వాటర్, ఒక టీ స్పూన్ నిమ్మరసం కలపండి. ప్రయోజనాలు: చర్మంపై మురికి తొలగిపోతుంది. "నేటి అదృష్ట రాశులు ఇవే.. సింహం,ధనస్సు సహా ఈ 5 రాశుల వాళ్లు డబ్బుతో నిండిపోతారు" నిమ్మరసం వల్ల మచ్చలు తగ్గుతాయి. రోజ్ వాటర్ చర్మాన్ని కూల్ చేసి, తేమను అందిస్తుంది. 2. బీట్‌రూట్-అలోవెరా జెల్ ఫేస్ మాస్క్ తయారీ విధానం: బీట్‌రూట్ రసం తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్లు అలోవెరా జెల్ కలపండి. మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి 10-12 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. అలోవెరా జెల్ చర్మానికి తేమను అందించి, చల్లదనాన్ని కలిగిస్తుంది. బీట్‌రూట్ రక్త ప్రసరణను మెరుగుపరచి, సహజమైన వెలుగును చర్మానికి అందిస్తుంది. 3. బీట్‌రూట్-బాదం పౌడర్ ఫేస్ మాస్క్ తయారీ విధానం: రెండు టేబుల్ స్పూన్లు బీట్‌రూట్ రసం, ఒక టేబుల్ స్పూన్ బాదం పౌడర్, ఒక టేబుల్ స్పూన్ పచ్చిపాలు కలిపి పేస్ట్ చేసుకోండి. ముఖానికి మసాజ్ చేస్తూ అప్లై చేసి, 20 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగండి. ప్రయోజనాలు: బాదం పౌడర్ చర్మ మలినాలను తొలగిస్తుంది. పాలు చర్మాన్ని మృదువుగా చేస్తాయి. బీట్‌రూట్ చర్మానికి పోషణను అందించి, ప్రకాశాన్ని పెంచుతుంది.



బీట్‌రూట్ ఫేస్ మాస్క్‌ల ప్రత్యేకతలు సహజ కాంతి: బీట్‌రూట్‌లో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి సహజమైన మెరుపు ఇస్తాయి. మొటిమల నివారణ: యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మొటిమలు, చర్మంపై ఏర్పడే మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. వృద్ధాప్య సూచనల తగ్గింపు: విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మాన్ని యవ్వనంగా ఉంచుతుంది. రక్త ప్రసరణ మెరుగుదల: చర్మానికి ఉత్తమమైన ఆక్సిజన్ సరఫరా అందించి, ఆరోగ్యవంతమైన గ్లోను ఇస్తుంది. చిట్కా: ఈ మాస్క్‌లు వాడే ముందు ముఖం క్లీన్ చేయడం మర్చిపోకండి. వాడిన తర్వాత మాయిశ్చరైజర్ అప్లై చేయడం వల్ల మరింత ఫలితాలు పొందవచ్చు. అలాగే బీట్‌రూట్ మాస్క్ వాడేటప్పుడు పాత దుస్తులు వేసుకోవడం మంచిది, ఎందుకంటే బీట్‌రూట్ మరకలు తొలగించడం కష్టం కావొచ్చు. మొత్తంగా, బీట్‌రూట్ సహజమైన చర్మ సంరక్షణకు ఒక మంచి పరిష్కారం. రోజువారీ బ్యూటీ రొటీన్‌లో ఈ సహజ మాస్క్‌లను చేర్చుకుంటే, కేవలం రెండు మూడు వారాల్లోనే మీ చర్మం తళతళ మెరుస్తుంది!

## రాజమౌళి సినిమాతో మాకెలాంటి సంబంధం లేదు



: దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో 2012లో వచ్చిన ఈగ సినిమా చేసిన సంచలనం అంతా ఇంతా కాదు. నాని హీరోగా నటించిన ఆ సినిమా గురించి అప్పట్లో అందరూ ఎంతో గొప్పగా చెప్పుకున్న విషయం తెలిసిందే. ఒక ఈగతో ఇలాంటి మ్యాజిక్ చేయొచ్చా అని ఆడియన్స్ అందరూ ఆశ్చర్యపోయేలా రాజమౌళి ఆ సినిమాను తీసి తన సత్తా చాటాడు. ఇదిలా ఉంటే ప్రేమలు మూవీలో నటించిన మాథ్యూ థామస్ ప్రధాన పాత్రలో ఇప్పుడు లవ్లీ అనే సినిమా వస్తోంది. మే 16న ఈ సినిమా మలయాళంతో పాటూ తెలుగు లో కూడా రిలీజ్ కానుంది. ఈగతో ఓ మనిషికి ఏర్పడిన ఫ్రెండ్‌షిప్ ఆధారంగా ఈ సినిమా రూపొందింది. దీంతో ఈ సినిమాను రాజమౌళి ఈగతో పోలుస్తూ నెటిజన్లు సోషల్ మీడియాలో పలు కామెంట్స్ చేస్తుండగా, వాటిపై మాథ్యూ స్పందించాడు. లవ్లీ సినిమా చాలా విభిన్నమైన కథతో రూపొందిందని, ఒక మనిషికి, ఈగకు మధ్య ఉండే స్నేహం ఎంత గొప్పగా ఉంటుందో దాన్ని అందరి మనసుని హత్తుకునేలా చూపించామని, లవ్లీ చూశాక అందరకీ ఓ ఫీల్‌గుడ్ సినిమా చూశామనే మంచి అభిప్రాయం కలుగుతుందని, ఎంతో సరదాగా ఉండే ఈ సినిమాను ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారని చెప్పాడు. లవ్లీ ట్రైలర్ చూసి అందరూ రాజమౌళి ఈగ సినిమాతో పోలుస్తున్నారు. ఈగ మూవీ యాక్షన్ థ్రిల్లర్ గా ఉంటుంది. ఆ సినిమాలో ఈగనే హీరో. కానీ తమ సినిమాలో ఈగ హీరో కాదని, ఈగ పేరు లవ్లీ కావడంతో తమ సినిమాకు లవ్లీ అనే పేరుని పెట్టామని.. సినిమా చూశాక ప్రతీ ఒక్కరికీ ఈ టైటిల్ పర్ఫెక్ట్ అనిపిస్తుందని చెప్పుకొచ్చాడు మాథ్యూ థామస్. ఈ సందర్భంగా బ్రొమాన్స్ సినిమాలో తన యాక్టింగ్ పై వచ్చిన విమర్శలపై కూడా మాథ్యూ మాట్లాడాడు. ఆ సినిమాలో కోపాన్ని కంట్రోల్ చేసుకోలేని వ్యక్తిగా కనిపించిన తన నటన కొన్ని సీన్స్ లో బాలేదని చాలా మంది కామెంట్స్ చేశారని, కానీ తాను మాత్రం ఆ పాత్రకు అనుగుణంగానే నటించానని చెప్పాడు. అయితే సినిమా రిలీజై తన యాక్టింగ్ పై వచ్చిన విమర్శలు విన్న తర్వాత సినిమా చూస్తే తనకూడా కాస్త ఓవర్ గా నటించినట్టు అనిపించిందని మాథ్యూ చెప్పాడు.

## అందానికే మరో అందం....



## రామ్ చరణ్ 'పెద్ది' హవా: లండన్‌లో ఫ్యాన్స్ నుంచి స్పెషల్ సర్ ప్రైజ్

: రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక సినిమా హైప్ వరల్డ్ వైడ్ గా గట్టిగానే పెరుగుతోంది. బుచ్చిబాబు సానా డైరెక్షన్‌లో మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ మాగ్నమ్ ఓపస్, రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇక సినిమా వచ్చే ఏడాది మార్చి 27 విడుదల కానుంది. 'పెద్ది' ఫస్ట్ షాట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ముఖ్యంగా గ్లింప్స్ చివరిలో రామ్ చరణ్ వేసిన క్రికెట్ షాట్ అభిమానులను ఎంతగానో ఆకర్షించింది. ఈ సినిమా కోసం అభిమానుల ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఇక లండన్‌లో రామ్ చరణ్ క్రేజ్ మరోసారి హైలెట్ అయ్యింది. మే 14న మేడమ్ టుస్సాడ్స్‌లో తన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తర్వాత, రామ్ చరణ్ అభిమానులను కలిశాడు. అభిమానులు అతనికి 'పెద్ది' కస్టమైజ్డ్ బ్యాట్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు.ఈ ఇంటర్నేషనల్ స్టైల్ ఇంగ్లీష్ విల్లో బ్యాట్‌ను కస్టమైజ్ చేయడానికి భారీ ఖర్చు అవుతుంది, కానీ 'పెద్ది' సినిమా పట్ల అభిమానుల ఉత్సాహం ఈ గిఫ్ట్‌ను మరింత ప్రత్యేకంగా మార్చింది. రామ్ చరణ్ అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు. అలాగే 'పెద్ది' సినిమా తన 'రంగస్థలం' కంటే భారీగా ఉంటుందని చెప్పి వారి ఆసక్తిని మరింత పెంచాడు. 'రంగస్థలం' 2018లో రూ.216 కోట్ల గ్రాస్ సాధించి, రామ్ చరణ్ కెరీర్‌లో ఒక బిగ్ హిట్ గా నిలిచింది. ఈ నేపథ్యంలో 'పెద్ది' సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందనే దానిపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గ్లింప్స్‌లో చూపించిన



క్రికెట్ షాట్ అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా, క్రికెటర్లను కూడా ఆకర్షించింది. కొందరు క్రికెటర్లు ఈ షాట్‌ను రీక్రియేట్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేశారు, ఇది సినిమా క్రేజ్‌ను మరింత పెంచింది. ఈ గ్లింప్స్ యూట్యూబ్‌లో 24 గంటల్లో 2 మిలియన్ వ్యూస్ సాధించి ట్రెండ్ సెట్ చేసింది. 'పెద్ది' సినిమా భారతీయ సినిమా చరిత్రలో భారీ స్థాయిలో రూపొందుతోంది. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, జాన్వీ కపూర్, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం, రామ్ చరణ్‌ను ఓ కబడ్డీ ప్లేయర్‌గా చూపించనుంది. ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తంగా, లండన్‌లో 'పెద్ది' కస్టమైజ్డ్ బ్యాట్ గిఫ్ట్, క్రికెట్ షాట్ ట్రెండ్‌తో రామ్ చరణ్ క్రేజ్ మరోసారి నిరూపితమైంది. 'రంగస్థలం' కంటే భారీ విజయం సాధిస్తుందని రామ్ చరణ్ చెప్పడంతో అభిమానుల ఆసక్తి రెట్టింపైంది. మరి ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.

## భారత క్రికెట్ జట్టు టెస్టు కెప్టెన్సీ గిల్‌కేనా.. గంభీర్‌తో 5 గంటల భేటీ మతలబు అదేనా..?




భారత స్టార్ బ్యాటర్ హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఇంగ్లండ్ పర్యటనకు ముందు తన టెస్ట్ కెరీర్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించడంతో తదుపరి కెప్టెన్ ఎంపిక కోసం బీసీసీఐ సెలక్షన్ కమిటీ తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో కెప్టెన్ రేసులో ముందు వరుసలో ఉన్న శుభ్‌మాన్ గిల్ . హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తో ఏకంగా ఐదు గంటలపాటు భేటీ అయినట్లు తెలుస్తోంది.ఇదిలావుంటే బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కూడా మే 6న వాంఖడే స్టేడియంలో గిల్‌తో మాట్లాడాడు. నూతన టెస్ట్ కెప్టెన్ ఎంపిక కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఈ కీలక భేటీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రోహిత్ శర్మ మే 7న తన టెస్ట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. అప్పటి నుంచి తదుపరి కెప్టెన్ రేసులో శుభ్‌మాన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. జూన్ 20న మొదలయ్యే ఇంగ్లండ్ టూర్‌తో భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్ ప్రయాణం ప్రారంభం కానుంది. కానీ ఇప్పటివరకైతే అధికారికంగా ఇంకా ఎవరి పేరును ఖరారు చేయలేదు.ఇలాంటి సమయంలో శుభ్‌మాన్ గిల్ టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్‌ను ఢిల్లీలోని అతడి నివాసంలో కలిసినట్లు సమాచారం. ఏకంగా ఐదు గంటలపాటు వీరి భేటీ జరిగినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ తన రిటైర్‌మెంట్ ప్రకటించడానికి ఒకరోజు ముందు అంటే మే 6న కూడా ఐపీఎల్ మ్యాచ్ అనంతరం బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వాంఖడే స్టేడియంలో గిల్‌తో ముచ్చటించాడు. ఈ రెండు భేటీలు క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అయితే ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం బీసీసీఐ శుభ్‌మాన్ గిల్‌ను టీమిండియా భవిష్యత్తు కెప్టెన్‌గా చూస్తోంది.ఈ ఐపీఎల్‌లో ప్రస్తుతం పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న గుజరాత్ టైటాన్స్‌ను ఒక కెప్టెన్‌గా శుభ్‌మాన్ గిల్ అద్భుతంగా నడిపిస్తున్నాడు. ఒక బ్యాటర్‌గానూ రాణిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ అధికారులు గిల్ మీద సానుకూల దృక్పథంతో ఉన్నట్లు సమాచారం. ఇదిలావుంటే కొందరు టీమిండియా మాజీ దిగ్గజాలు మాత్రం బుమ్రా వైపు మొగ్గు చూపుతున్నారు. రవిచంద్రన్ అశ్విన్ అనూహ్యంగా సీనియర్ ప్లేయర్ అయిన రవీంద్ర జడేజాను కెప్టెన్‌గా చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తంచేశాడు.ఏది ఏమైనప్పటికీ టీమిండియా టెస్టు జట్టు కొత్త కెప్టెన్ ఎవరనే విషయంలో ఉత్కంఠ ఇంకొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.